
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



ముంచెత్తిన వరద

జిల్లాలోని ఇల్లెందు, గుండాల మండలాల్లో వాగులు ఉగ్రరూపం దాల్చడంతో పంటలతో పాటు ఇళ్లు కూడా నీటమునిగాయి. 8లో



మృతుల కుటుంబాలకు పరామర్శ

లచ్చగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వాగులో పడి మృతి చెందగా, కుటుంబసభ్యులను ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శించారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పాటిల్ తదితరులు

చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ముద్రించిన వాల్ పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో గణేష్ ఉత్సవ కమిటీలు ప్రత్యేక దృష్టి సారించి మట్టి విగ్రహాలనే పూజించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. పీఓపీ విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేయడంతో జలాశయాల్లో కాలుష్యం పెరిగిపోతోందని అన్నారు. మట్టి విగ్రహాలపై కాలుష్య నియంత్రణ మండలి చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బి.రవీందర్, సిబ్బంది అరుణాదేవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: భారీ వర్షాలకు తోడు పలు చోట్ల వరదలు వస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సెల్ఫీలు, సరదా కోసం ప్రవాహాల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. వర్షాల కారణంగా రోడ్లు బురదమయమై వాహనాల టైర్లు జారే ప్రమాదం ఉన్నందున నెమ్మదిగా రాకపోకలు సాగించాలని తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరుగుతుండడంతో ప్రజలు అధికారుల సలహాలు పాటించాలని, పోలీసుల ఆంక్షలను అధిగమించొద్దని పేర్కొన్నారు. ప్రమాదం జరిగినా, ఆపద ఎదురైనా డయల్ 100కు ఫోన్ చేయాలని.. తద్వారా 24గంటల పాటు అందుబాటులో ఉండే డీడీఆర్‌ఎఫ్ బృందాల ద్వారా సాయం అందిస్తామని ఎస్పీ ఓ ప్రకటనలో తెలిపారు.

సీపీఓ శ్రీనివాసరావు బదిలీ



సీపీఓను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

చుంచుపల్లి : జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిగా పనిచేస్తున్న యూ.శ్రీనివాసరావును హైదరాబాద్ బీసీ కమిషన్‌కు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. దీంతో వెంటనే ఆయన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. 2021 మార్చి నుంచి ఆయన జిల్లాలో సీపీఓగా పనిచేస్తున్నారు. మూడేళ్లపాటు సేవలందించిన శ్రీనివాసరావు జిల్లాలో పనిచేసిన పలువురు కలెక్టర్ల నుంచి ప్రశంసలు అందుకున్నారు. పదోన్నతిపై హైదరాబాద్ వెళ్తున్న సీపీఓను వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన స్థానంలో మైనార్టీ, సంక్షేమశాఖ అధికారి సంజీవరావుకు కలెక్టర్ జితేష్ పాటిల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఎట్టకేలకు సేఫ్..

కిన్నెరసాని దీవిలో చిక్కుకున్న ఏడుగురు

- ఆరుగురిని రక్షించిన రెస్క్యూ బృందాలు
- వరద ప్రవాహంలో ఒకరు గల్లంతు ?
- నాలుగు గంటల పాటు ఆపరేషన్
- పర్యవేక్షించిన కలెక్టర్, ఎమ్మెల్యే



కిన్నెరసాని దీవి వద్ద పర్యవేక్షిస్తున్న కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ రూరల్: పాల్వంచ, బూర్గంపాడు మండలాల సరిహద్దులోని కిన్నెరసాని – ముర్రేడు వాగుల సంగమం వద్ద వరద నీటిలో చిక్కుకున్న ఆరుగురిని రెస్క్యూ టీం సభ్యులు రక్షించారు. కాగా వరదలో ఒకరు గల్లంతయినట్టు సమాచారం. బుధవారం సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు బాధితులను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు తీవ్రంగా శ్రమించాయి.

నది మధ్యలో దీవి..

పాల్వంచ మండలం దంతెలబోర, గంగదేవిగుప్ప, బూర్గంపాడు మండలం సోంపల్లె గ్రామాల నడుమ కిన్నెరసాని నది రెండు పాయలుగా చీలుతుంది. ఎడమ పాయ వైపు సోంపల్లి ఉండగా కుడి వైపు దంతెలబోర ఉన్నాయి. కుడివైపు పాయలోనే ముర్రేడు వాగు కిన్నెరసానిలో కలుస్తుంది. రెండు పాయలుగా చీలిన ప్రదేశంలో 100 ఎకరాలకు పైగా ఖాళీ స్థలం దీవిలా ఉంది. ఇందులో సమీప గ్రామాల వారి సాగు భూములతో పాటు కొంత అడవి ఉంది. స్థానికులు దీన్ని వ్యవసాయం, చేపలు పట్టడం, పశువులను మేపేందుకు ఉపయోగిస్తున్నారు.

పెరిగిన వరద..

కిన్నెరసాని నీటి విడుదలతో దంతెలబోర – సోంపల్లె గ్రామాల వద్ద రెండు పాయల్లోనూ నీటి ప్రవాహం పెరిగింది. మరోవైపు ఎగువన ఆళ్లపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో కురిసిన వర్షాలతో ముర్రేడు వాగులోనూ వరద ప్రవాహం తీవ్రమైంది. దీంతో కొన్ని గంటల్లోనే దీవికి నలువైపులా హోరెత్తే వరద ప్రవాహం మొదలైంది. సాయంత్రం వరకు తగ్గుముఖం పట్టకపోవడంతో ప్రవాహంలో చిక్కుకున్న వారిలో ముగ్గురు ఈదుతూ నది దాటేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో నీళ్లలోకి ముందుగా దిగిన జారే సాయి ప్రవాహ వేగానికి గల్లంతయ్యాడు. దీంతో మిగిలిన వారు అప్రమత్తమై తమను కాపాడాలంటూ గ్రామస్తులను ఫోన్ ద్వారా కోరారు.



వరద ముంపులో చిక్కుకున్న బాధితులు

గేట్లు మూసివేసి..

కిన్నెరసాని దీవిలో ఏడుగురు చిక్కుకున్న విషయం తెలియగానే సాయంత్రం 6.30 నుంచి 7 గంటల వరకు ప్రాజెకు గేట్లను మూసివేశారు. ఆ తర్వాత పాల్వంచ,బూర్గంపాడు పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్, ఫైర్ సేఫ్టీ టీంలు రంగంలోకి దిగి బాధితులను రక్షించేందుకు ప్రయత్నించారు. మొదటి గంటసేపు చేసిన ప్రయత్నాలు విఫలం కావడం, చీకటి పడడంతో అందరిలోనూ ఉత్కంఠ పెరిగింది.

ఆరుగురు సురక్షితం..

రాత్రి 8 గంటల సమయంలో ఎడమ వైపు పాయలో నీటి ప్రవాహం కొంత తగ్గడంతో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, ఫైర్ సిబ్బంది సాహసోపేతంగా దీవి వద్దకు చేరుకున్నారు. అప్పటికే చీకటి పడడంతో అక్కడున్న వారిని సురక్షితంగా సోంపల్లె వైపు ఒడ్డుకు చేర్చారు. ఏడుగురు వరద ప్రవాహంలో చిక్కుకోగా ఆరుగురు సురక్షితంగా బయట పడ్డారు. రెస్క్యూ ఆపరేషన్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పర్యవేక్షించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ఘటనపై ఆరా తీశారు. కాగా వరదలో ఎంత మంది చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు చేపట్టిన ఆపరేషన్ ఎలా కొసాగింది. ఎంత మందిని కాపాడారనే అంశాలపై జిల్లా యంత్రాంగం నుంచి రాత్రి 12 వరకు కూడా అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో కిన్నెరసాని రెస్క్యూ ఆపరేషన్‌పై పూర్తి స్పష్టత కొరవడింది.

ప్రాజెక్ట్ నీటి విడుదలతో..

కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి బుధవారం ఉదయం 7 గంటల సమయంలో గేట్లు ఎత్తడం ద్వారా వెయ్యి క్యూసెక్కుల వరదను కిందికి వదిలారు. నదిలో వరద నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో ఎప్పటిలాగే దంతెలబోర గ్రామానికి చెందిన తటుకుల కేదారి, దేశబోయిన ఈశ్వరయ్య, మంచినీళ్ల మునలయ్య, గంగదేవిగుప్ప గ్రామానికి చెందిన కుంజా భద్రయ్య, ఇర్పా నాగేష్, జారే సాయి, సుధాకర్ కిన్నెరసాని కుడి వైపు పాయ దాటుకుని దీవిలోకి వెళ్లారు. వీరు అక్కడికి చేరుకున్న తర్వాత ఎగువ నుంచి వరద పోటు పెరగడంతో 8:45 గంటల సమయంలో 11 వేల క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు నుంచి దిగువకు వదిలారు. ఆ తర్వాత 10:45 గంటలకు మరో 53 వేల క్యూసెక్కులు విడుదల చేశారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.60 లక్షలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారులు, ఈఓ రమాదేవి సమక్షాన చిత్రకూట మండపంలో లెక్కింపు చేపట్టగా 44 రోజులకు గాను రూ.60,81,779 ఆదాయం నమోదైంది. అలాగే, 94 గ్రాముల బంగారం, 555 గ్రాముల వెండి, వివిధ దేశాల కరెన్సీ కూడా లభించిందని ఈఓ తెలిపారు.

నదులు శాంతించాలని పూజలు

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు తగ్గాలని, ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణ, గోదావరి నదులు శాంతించాలని భద్రాద్రి రామయ్య ఆలయ అర్చకులు, పండితులు నదీ పూజ జరిపారు. గోదావరి మాతకు పసుపు, కుంకుమ సమర్పించారు. ఇక తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



నదీ హారతి ఇస్తున్న ఈఓ రమాదేవి, అర్చకులు

బాధితులకు భద్రాద్రి రామయ్య అండ

5 వేల పులిహోర ప్యాకెట్లు సిద్ధం

భద్రాచలం: విపత్కర వరదలను ఎదుర్కొన్న ఖమ్మం బాధితులకు 'భద్రాద్రి రాముడు' అండగా నిలిచాడు. అన్నమో.. రామచంద్రా అంటూ అలమటిస్తున్న నిరాశ్రయులకు దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర ఆహార ప్రసాదం అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు నిత్యాన్నదాన సత్రంలో ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో 5 వేల పొట్లాలు తయారు చేసి, ప్రత్యేక వాహనంలో ఆలయ సిబ్బంది తీసుకెళ్లారు. బుధవారం కొన్ని ప్యాకెట్లు అందించగా, గురువారం మిగిలిన ప్రసాదాన్ని అందజేయనున్నారు. ఆపద సమయంలో సాయం కోసం ఎదురుచూస్తున్న వారికి కనీస ధర్మంగా ఆలయం తరఫున ఆహారం అందిస్తున్నట్లు ఈఓ తెలిపారు. ప్యాకెట్ల తయారీలో ఆలయ అధికారులు, సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

డీసీసీబీలో మరో ఇద్దరిపై వేటు

ఇద్దరు జీఎంల సస్పెన్షన్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో మరో ఇద్దరు ఉన్నతాధికారులు సస్పెండ్ అయ్యారు. పలు అంశాల్లో సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరించారని పేర్కొంటూ ఇద్దరు జనరల్ మేనేజర్లు ఏ.పద్మావతి, కె.నర్మదను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర సహకార శాఖ డైరెక్టర్ పి.ఉదయ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రైతుబీమా ప్రీమియం వ్యవహారంలో పద్మావతి, బదిలీలు, ఇంక్రిమెంట్లు చెల్లింపులు, ఇతర అంశాల్లో నర్మదను సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో పద్మావతి ఖమ్మం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తుండగా, నర్మద ఇటీవలే నల్లగొండ డీసీసీబీకి బదిలీ అయ్యా రు. ఇప్పటికే రుణమాఫీలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్‌ను సస్పెండ్ చేయగా.. మరో ఇద్దరిని సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఏమిటీ కారణం

బ్యాంకు పరిధిలో రైతుబీమా పాలసీని రూ.50 వేల నుంచి రూ.2లక్షలకు పెంచారు. ప్రీమియంపై టెండర్లు ప్రకటించగా ఎస్‌బీఐ లైఫ్ దక్కించుకుంది. సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్, జీఎం పద్మావతి నేతృత్వాన ప్రక్రియ నిర్వహించగా పారదర్శకత లోపించిందని, పీఏసీఎస్‌ల నుంచి తీర్మానాలు తీసుకోలేదనే కారణంతో సస్పెన్షన్ వేటు వేశారు. ఇక డీసీసీబీ అధికారులు, ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, ఇతర ప్రోత్సాహకాలు, ఆడిట్ చార్జీల పెంపు, బదిలీలు వ్యవహారాలపై వచ్చిన ఆరోపణలపై నర్మదపై వేటు పడింది. చైర్మన్, పాలకవర్గం ప్రమేయం లేకుండా నిర్ణయాలు అమలుచేయడంతోనే సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

పంట నష్టం నివేదికలు అందించండి

పాల్వంచరూరల్ : భారీవర్షాలతో జిల్లాలో 2,923 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని డీఏఓ బాబూరావు తెలిపారు. మండలంలోని పాండురంగాపురం, సూరారం, ఉల్వనూరు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంట నష్టానికి సంబంధించి త్వరగా సర్వే పూర్తి చేయాలని, మూడు రోజుల్లో తనకు నివేదిక అందజేయాలని అధికారులకు సూచించారు. వరదలతో పాల్వంచ, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బాబూరావు

మొదటి ప్రమాద హెచ్చరిక దాటి..

- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి
- రాత్రి 10 గంటలకు 44.10 అడుగులుగా నమోదు
- బాధితులను పునరావాస శిబిరాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశం



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి ప్రవహిస్తోంది. నదికి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఇక్కడ వరద ఉధృతి పెరిగింది. బుధవారం మధ్యాహ్నం 12: 58 గంటలకు నీటిమట్టం 43 అడుగులు దాటడంతో ఆర్డీఓ దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

గంటగంటకూ పెరుగుతూ..

గోదావరి నీటిమట్టం బుధవారం ఉదయం 8 గంటలకు 42.30 అడుగులుగా ఉంది. మధ్యాహ్నం 12.58 గంటలకు 9,32,288 క్యూసెక్కుల ప్రవాహంతో 43 అడుగులకు చేరగా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అనంతరం స్వల్పంగా పెరుగుతూ సాయంత్రం 7 గంటలకు 44.4 అడుగులకు చేరింది. రాత్రి 10 గంటలకు 44.10 అడుగులుగా నమోదైంది. కాగా, మరో నాలుగు రోజుల పాటు భారీ వర్ష సూచన నేపథ్యంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముంపు మండలాల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ముంపునకు గురయ్యే కాలనీలు, గ్రామాలను గుర్తించాలని, పునరావాస శిబిరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వరద నీరు ముంచెత్తే ప్రమాదం ఉన్నందున బాధితులను ముందుగానే శిబిరాలకు తరలించి, అన్ని వసతులు కల్పించాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన..

గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచారం కేంద్రానికి వచ్చే ఫోన్ నంబర్లు, చేసే వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వరద బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. సిబ్బంది 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక విధులను కేటాయించినట్లు తెలిపారు. సమాచారం కోసం భద్రాచలం ఐటీడీఏలో 79952 68352, కలెక్టరేట్‌లో 93929 19743, 08744 – 241950 నంబర్లు అందుబాటులో ఉంటాయని వివరించారు.

డిగ్రీ మెరిట్ ఆధారంగానే బీఈడీలో ప్రవేశం

భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్

భద్రాచలంటౌన్: డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా భద్రాచలం ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాలలో అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. 2024–26 విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను పీఓ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఈడీ కళాశాలలో 26వ బ్యాచ్‌కి అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని, 100 సీట్ల కోసం ఎంపికైనవారు ఈ నెల 13న కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇందులో ఎవరైనా చేరకపోతే ఈ నెల 17న ఆ తదుపరి వరుసలో ఉన్న వారితో భర్తీ చేస్తామని తెలిపారు. వివరాల కోసం ప్రిన్సిపాల్ యం.వీరూనాయక్ (89784 77345)ను సంప్రదించాలని పీఓ సూచించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ పాల్గొన్నారు.



అభ్యర్థుల జాబితా విడుదల చేస్తున్న పీఓ, అధికారులు

బోధనతో పాటు సేవలోనూ ముందంజ

రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన లెక్చరర్ ఖుర్షీద్



ఎం.డీ.ఖుర్షీద్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని మణుగూరు జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎండీ.ఖుర్షీద్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. పాతపాల్వంచకు చెందిన ఆయన భద్రాచలం జూనియర్ కళాశాలలో పదేళ్ల పాటు విధులు నిర్వర్తించి ఇటీవలే మణుగూరు కళాశాలకు బదిలీ అయ్యారు. 1996లో నాన్ టీచింగ్ ఉద్యోగిగా బాధ్యతలు చేపట్టిన ఖుర్షీద్ పొలిటికల్ సైన్స్‌పై మక్కువతో అధ్యాపకుడిగా అర్హత సాధించారు. 2014లో భద్రాచలం జూనియర్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన విద్యార్థులు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడంలో ముందు నిలుస్తున్నారు. న్యాయసేవా సదస్సులను పలు ప్రాంతాల్లో నిర్వహించి చట్టాలపై మారుమూల ప్రాంతాల వారికి అవగాహన కల్పించారు. అలాగే, చట్టాలపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి బ్యాంకుల ఆధ్వర్యాన బహుమతులు ఇప్పించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా భద్రాచలంలో వందల సంఖ్యలో మొక్కలు నాటించి ఆదర్శంగా నిలిచారు. కంటి వెలుగు వంటి తదితర కార్యక్రమాల్లో విద్యార్థులతో కలిసి వలంటీర్‌గా పనిచేశారు. కళాశాలలో నెలకు రెండు సార్లు హెల్త్ చెకప్ క్యాంపులను ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించారు. అలాగే, ఐటీసీ సహకారంతో దాదాపు రూ.3లక్షల విలువైన నోట్ పుస్తకాలను అందించడంలో ప్రధాన పాత్ర పోషించారు. గతంలో జిల్లాస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా అప్పటి కలెక్టర్ అనుదీప్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఖుర్షీద్ ఈ ఏడాది రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికవడంపై జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, మణుగూరు కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఖుర్షీద్ మాట్లాడుతూ రాష్ట్ర అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ఈ అవార్డు బలాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఉమాదేవి



ఉమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని రంగనాయిని గుట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు(ఎస్‌జీటీ) ఉమాదేవి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. 1998లో దుమ్ముగూడెం మండలం పర్ణశాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరిన ఉమాదేవి.. నాటి నుంచి పనిచేసిన ప్రతీ చోట విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారు. పిల్లలకు అర్థమయ్యేలా బోధిస్తూ వారికి చదువుపై ఆసక్తి పెరిగేలా చూశారు. ప్రతీ అంశాన్ని ప్రాక్టికల్‌గా చూపిస్తూ బోధించడం ఆమె ప్రత్యేకత. తన 26 ఏళ్ల ప్రస్థానంలో ఎందరో విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలిచేలా చేశారు. ప్రత్యేక ప్రణాళికతో బోధిస్తున్న ఉమాదేవి కృషిని గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారులు 2023లో ఎఫ్‌ఎల్‌ఎన్ బెస్ట్ ప్రాక్టీస్ హ్యాండ్‌బుక్‌లో ప్రత్యేకంగా రెండు పేజీలు ప్రచురించారు. ఉమాదేవి ఈ ఏడాది జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం పట్ల ఎంఈఓ సమ్మయ్య, ఉపాధ్యాయులు ఏజే ప్రభాకర్, చిగురుమళ్ల శ్రీనివాస్, జిల్లా అధికారులు అభినందించారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

నేడు గురు పూజోత్సవం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం గురు పూజోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రకటించారు. ఈ ఏడాది జిల్లాలో 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా వీరితో పాటు 2023లో 34 మంది, 2022లో 43 మంది.. మొత్తం 100 మంది ఉపాధ్యాయులకు గురువారం కలెక్టరేట్‌లో పురస్కారాలు అందించనున్నారు.

చేలలో నీరు నిల్వకుండా చూడాలి

కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ



రైతులతో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్తలు

బూర్గంపాడు: భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న చేలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ అన్నారు. మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో వరదలతో దెబ్బతిన్న పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. అధిక వర్షాలు, వరదలతో పత్తికి తెగుళ్లు ఆశిస్తున్నాయని, చేలలో నిలిచిన నీటిని కాల్వలు తీసి బయటకు పంపిస్తే కొంతమేర తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. నీరు నిలిచి వడలిపోయిన మొక్కల మొదళ్లలో 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందు లీటర్ నీటిలో కలిపి పోయాలన్నారు. వారం వ్యవధిలో రెండుసార్లు ఇలా పోస్తే మొక్కలు త్వరగా తేరుకుంటాయని చెప్పారు. దెబ్బతిన్న పత్తి చేలలో 19:19:19 లేదా మల్టీ కే(13:0:45) మందులను నీటిలో కలిపి చల్లాలని సూచించారు. ప్రస్తుతం పత్తి పూత, పిందె దశలో ఉన్నందున తెగుళ్లు, పురుగు, దోమ ఆశించే ప్రమాదం ఉందన్నారు. పచ్చదోమ పెరిగితే 5 శాతం వేపనూనె, 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. రసం పీల్చే పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1:4 నిష్పత్తిలో మొక్కల కాండానికి పూయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ బి.తాతారావు, కేవీకే శాస్త్రవేత్తలు ఆర్. శ్రీనివాసరావు, బి. శివ, ఏఓ శంకర్, ఏఈఓలు శృతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు రశీదు ఇస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానం నిర్వహణకు పాల్వంచకు చెందిన భక్తులు విరాళం అందించారు. వి.శ్రీనివాసరాజు ఆయన తల్లిదండ్రుల పేరిట రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించి, స్వామిని దర్శించుకున్నారు.

ఉషా చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం


ప్రణీతను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ

కొత్తగూడెంటౌన్: మంచిర్యాలలో ఈ నెల 1న జరిగి న సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉషా చాంపియన్ షిప్ లో కొత్తగూడెం రామవరానికి చెందిన బి.ప్రణీత బంగారు పతకం సాధించింది. అంతేకాక ఈ నెల 21వ తేదీ నుంచి ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీ యస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమెను డీవైఎస్‌ఓ పి.పరంధామరెడ్డి, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్, కోచ్‌లు ఐ.ఆదినారాయణ, బి.సాగర్‌తో పాటు తిరుమల్‌రావు, లక్ష్మణ్ తదితరులు బుధవారం అభినందించారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌ఆర్‌హెచ్‌ఎంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎంఎం యూనిట్‌లో ఒక పోస్టు, బస్తీ దవఖానాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టులు 3, ల్యాబ్ టెక్నీషియన్, పారామెడికల్ పోస్టులు ఒక్కోటి చొప్పున ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

కొనసాగుతున్న ఒంటిపూట బడులు

కొత్తగూడెంఅర్బన్: భారీ వర్ష సూచనల నేపథ్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు బుధవారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం తరగతులకు సెలవు ప్రకటించామని, ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఈ మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆటో బోల్తా : 9 మందికి గాయాలు

ములకలపల్లి: ఆటో బోల్తా పడి తొమ్మిది మందికి గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పొగళ్లపల్లికి చెందిన పలువురు బుధవారం కొత్తగూడెంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా ములకలపల్లి సరస్వతి శిశుమందిర్ సమీపంలో కుక్క అడ్డురావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్నవారు తీవ్ర గాయాలపాలై హాహాకారాలు చేశారు. ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. పాలకుర్తి లాజర్, మక్కా మనోహర్, సంతపురి చిట్టిబాబు, కాంపాటి ఖాసీం, గుండూరి బాబు తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మంగపేట పీహెచ్‌సీకి తరలించగా, పీహెచ్‌సీలో వైద్యాధికారి లేకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్యూటీలో ఉన్న సెకండ్ ఏఎన్‌ఎం రమాదేవి చికిత్స అందించారు. ఎస్సై రాజశేఖర్ ఆస్పత్రిని సందర్శించి క్షతగాత్రుల వివరాలను సేకరించారు. అనంతరం 108 వాహనంలో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో ఆటో ధ్వంసమైంది.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రాజవీధికి చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. పట్టణ ఎస్సై విజయలక్ష్మి కథనం ప్రకారం.. రాజవీధికి చెందిన వెంకటేశ్వరావు (28) ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలోనే.. ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచ: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పట్టణ పరిధిలోని బొల్లేరుగూడెంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.13,800 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

ముంచెత్తిన వరద


ఆళ్లపల్లి-కొత్తగూడెం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగు

వాగులు ఉగ్రరూపం దాల్చాయి. పంటచేలు నీటమునిగాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాలు జలమయంగా మారాయి. కొంత సమయం తెరిపిచ్చి మళ్లీ వర్షం కురుస్తుండగా వాగుల్లో తగ్గుముఖం పడుతున్న వరద ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. బుధవారం తెల్లవారుజాము నుంచి పలుచోట్ల ఏకధాటిగా వాన కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. ఇప్పటికే చెరువులు నిండగా, అలుగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పల్లె, పట్టణాలు వణికిపోతున్నాయి.

ఉప్పొంగుతున్న వాగులూ వంకలు

- పలు గ్రామాలకు నిలిచినపోయిన రాకపోకలు
- రహదారుల మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు
- నీట మునిగిన పంట చేలు, విరిగిన విద్యుత్తు స్తంభాలు
- జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు

నాలుగు రోజులుగా రాకపోకలు బంద్

గుండాల: గుండాల, ఆళ్ల మండలాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కిన్నెరసాని, మల్లన్న వాగు, ఏడు మెళికలవాగు, జల్లేరు, దున్నపోతుల వాగులకు వరద పోటెత్తుతోంది. ఆళ్లపల్లి-కొత్తగూడెం మార్గంమధ్యలో కిన్నెరసాని వాగు లోవెల్ వంతెనపై ప్రవహిస్తుండటంతో జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. పున్యపు వాగు, దయ్యాల లొద్ది వాగులు సైతం ఉప్పొంగుతున్నాయి. కొడవటంచ వద్ద లోలెవల్ వంతెనపై వాగు ఉప్పొంగి కొవడటంచ, పాలగూడెం, నాగారం, మల్లెల గుంపు, అడవిరామారం, సీతానగర్, పాతూరు గ్రామాలకు రాకపోకలు నాలుగు రోజులుగా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీతానగర్ గ్రామానికి చెందిన రైతు పూనెం రవికుమార్ రెండు దుక్కిడెడ్లు మూలమడుగు వర్రెలో పడి మృతి చెందాయి. పలుచోట్ల పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు వరదలకు నేలవాలాయి.


ఆళ్లపల్లి మండలం సీతానగర్‌లో వర్రెలో పడి మృతి చెందిన పశువులు

మూడు వార్డుల్లోకి వరదనీరు..

ఇల్లెందు: ఇల్లెందు మంచినీటి చెరువు అలుగు వాగు ఉధృతంగా ప్రవహించింది. అలుగు వాగు, బుగ్గవాగు జతకలవడంతో వరద ఉధృతి మరింతగా పెరిగింది. పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్, నంబర్-2 బస్తీలోని పలువురి ఇళ్లు జలమయంగా మారాయి. ముంపు పట్టిన ఇళ్లవాసులను బర్లపెంట బడిలోని పునరావాస కేంద్రానికి తరలించి ఆహారం, నీరు అందించారు. బ్రిడ్జిల వద్ద వరద ప్రవాహానికి అడ్డులేకుండా రెండు జేసీబీలను అందుబాటులో ఉంచి చెత్తాచెదారం చిక్కితే తక్షణమే తొలగింపజేస్తున్నారు. 20వ వార్డు స్టేషన్ బస్తీలో 35 ఇళ్లు నీట మునిగాయి. బుగ్గవాగు రాత్రి వేళ పోటెత్తడంతో, అక్కడి ప్రజలను స్టేషన్ బస్తీలోని ఉర్దూ, యూపీఎస్ పాఠశాలలకు తరలించి పునరావాసం కల్పించారు. స్టేషన్ బస్తీలో బండ్ల చంద్రయ్య అనే వ్యక్తి ఇల్లు కూలిపోయింది. లాలయ్య ఇంటి గోడ పడిపోయింది. మంచినీటి చెరువు అలుగు ఉధృతితో పట్టణంలోని 1,2 వార్డులు గల సత్యనారాయణపురానికి రాకపోకలు నిలిపివేశారు. సత్యనారాయణపురం మార్గంలో, చెరువు అలుగు వద్ద మున్సిపల్ వర్కర్లు, పోలీసులను కాపలా ఉంచారు.


స్టేషన్ బస్తీలో నీట మునిగిన ఇళ్లు


వరద ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

సందర్శించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

పట్టణంలోని నంబర్-2 బస్తీ, బర్లపెంట, ఎల్‌బీఎస్ నగర్, సత్యనారాయణపురం, చెరువు అలుగు, స్టేషన్ బస్తీల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. వచ్చే వర్షాకాలంలోలోగా బుగ్గవాగు వెంట రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డానియేల్, కమిషనర్ యాదగిరి, డీఈ మురళీ కృష్ణ, తహసీల్దార్ రవికుమార్, సీఐ బత్తుల సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ అంకుషావళి, ఏఈ కుమారస్వామి, కౌన్సిలర్లు యలమందల వీణ వాసు, మొగిలి లక్ష్మి, వారా రవి, కటకం పద్మావతి, పత్తి స్వప్న, నాయకులు బోళ్ల సూర్యం, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీను, పడిదల నవీన్, గోచికొండ శ్రీదేవి, హరినాథ్‌బాబు తదితరులు ఉన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఇల్లెందురూరల్: మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఐదు గంటలపాటు కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. రాఘబోయినగూడెం పెద్దచెరువు అలుగు ఉధృతితో వంతెన మీదుగా వరద ప్రవహించింది. దీంతో పంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పోలారం గ్రామపంచాయతీ పాతచెరువు అలుగు ఉధృతితో పోలారం, అమర్‌సింగ్‌తండా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆయా చోట్ల వరద ఉధృతిని అధికారులు పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. సీఎస్పీ బస్తీలో చెట్టు విరిగి పడి, రెండు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. రేపల్లెవాడ, కొమరారం, పోచారంతండా, మాణిక్యారం, మస్సివాగు, మామిడిగుండాల తదితర గ్రామాపంచాయతీల్లో పంట చేలు నీటమునిగాయి. ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు కొద్దిసేపు స్తంభించాయి.


సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీలో విరిగి పడ్డ స్తంభం


వంతెన మీదుగా ప్రవహిస్తున్న రాఘబోయినగూడెం పెద్దచెరువు అలుగునీరు

మృతుల కుటుంబాలకు ఎంపీ పరామర్శ

పరిహారం అందించిన ఎమ్మెల్యే


మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: కిన్నెరసాని వాగులో పడి మృతి చెందిన లచ్చగూడెం వాసులు కొమరం వెంకటేశ్వర్లు, దొడ్డ సాయి కుమార్ కుటుంబాలను బుధవారం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించారు. వారి ఇళ్లకు వెళ్లి కన్నీరు మున్నీరవుతున్న మృతుల కుటుంబాలను ఓదార్చారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల పరిహారం చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేం కోరం కనకయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పి పోయేది కాదని, చేతల ప్రభుత్వమని పేర్కొన్నారు. నగదును కుటుంబ అత్యవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ రవీంద్రరావు, సీఐ తాటిపాముల సురేష్, ఎంపీఓ జేఎల్ గణేష్ గాంధీ, కార్యదర్శి కవిత, మండల అధ్యక్షుడు భూక్య దేవా, జిల్లా నేత కోరం సురేందర్, రెడ్యానాయక్, మంగీలాల్, గణేష్, పోశాలు, మధురెడ్డి, సంజయ్, శివ, ప్రసాద్, రాందాస్, చంద్రకళ, రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జంగాలపల్లిలో ఒకరు గల్లంతు


గల్లంతైన సుధాకర్ (ఫైల్)

టేకులపల్లి: మండలంలోని బర్లగూడెం పంచాయతీ జంగాలపల్లికి చెందిన ఓ వ్యక్తి బుధవారం గల్లంతయ్యాడు. బోడు ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. జంగాలపల్లికి చెందిన 40 ఏళ్ల నారగోని సుధాకర్ బుధవారం ఉదయం బురదోని వాగు సమీపంలోకి పశువులను మేతకు తీలుకెళ్లాడు. మధ్యాహ్నం పశువులు మాత్రమే ఇంటికి రాగా, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఆరా తీశారు. సుధాకర్ ఎక్కడా కనిపించకపోవడంతో వాగులో పడి కొట్టుకుని పోయాడా అనే అనుమానంతో బోడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, గజ ఈతగాళ్లు వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు ఆచూకీ లభించలేదు. సుధాకర్ కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ రవీంద్రరాబు, సీఐ తాటిపాముల సురేష్, ఎంపీఓ జేఎల్ గణేష్ గాంధీ, కార్యదర్శి రమాదేవి వాగు ప్రాంతాన్ని పరిశీలించారు.

తూర్పుగూడెంలో యువకుడిని కాపాడిన స్థానికులు

మండలంలోని ప్రెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం-స్టేషన్‌బేతంపూడి మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో స్టేషన్‌బేతంపూడికి చెందిన యువకుడు బాణోతు రవి కిరణ్ కొట్టుకుపోతుండగా.. తూర్పుగూడెం గ్రామానికి చెందిన జాటోతు నరేష్, లూనావత్ లాలు, భూక్య వీరు కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పూరిల్లు నేలమట్టం


కూలిన గిరిజనుడి ఇల్లు

అశ్వారావుపేటరూరల్: భారీ వర్షాలతో ఓ గిరిజనుడి పూరిల్లు బుధవారం కుప్పకూలింది. మండలంలోని తిరుమల కుంట గ్రామానికి చెందిన మడకం బాబూరావు పూరిల్లు అధిక వర్షాలతో దెబ్బతినగా, ఒక్కసారిగా ఇల్లు నేలమట్టమైంది. ఇంట్లో ఉన్న వారంతా భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. దీంతో వారంతా సురక్షితంగా బయటపడ్డారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ప్రభుత్వ సాయం అందిస్తామని తెలిపారు.

కిన్నెరసానికి వరద పోటు


ప్రాజెక్ట్ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయానికి వరద పోటెత్తుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా, బుధవారం 404.30 అడుగులుగా నమోదైంది. ఎగువ నుంచి 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్ట్‌లోకి వస్తుండగా, 8 గేట్లను ఎత్తి ఉంచి 53 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా ప్రాజెక్ట్ గేట్లను ఎత్తడంతో రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య లోలెవల్ చప్టా మునిగి 24 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

భారీగా ద్విచక్రవాహనాలు స్వాధీనం

- హైదరాబాద్‌లో చోరీ.. అశ్వారావుపేటలో విక్రయం..!
- సాగుతున్న సీసీఎస్ పోలీసుల విచారణ?

అశ్వారావుపేటరూరల్: హైదరాబాద్‌లో చోరీ చేసిన ద్విచక్రవాహనాలు అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో విక్రయించిన వ్యవహారం బుధవారం వెలుగు చూసింది. కొంతకాలంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో చోరీకి గురవుతుండగా, ఈ వ్యవహారంపై అక్కడి సీసీఎస్ పోలీసులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే బైక్ చోరీలకు పాల్పడే ఓ ముఠా చిక్కినట్లు తెలుస్తోంది. బైక్‌లను దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. అతని ద్వారా అశ్వారావుపేట మండలానికి చెందిన మరో వ్యక్తి ద్విచక్రవాహనాల నంబర్ ప్లేట్లను మార్చి స్థానికులకు విక్రయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్ నుంచి సీసీఎస్ పోలీసులు వచ్చి విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అశ్వారావుపేటలో 20, దమ్మపేటలో 6 ద్విచక్రవాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. మరికొన్ని బైక్‌లను గుర్తించే పనిలో సీసీఎస్ పోలీసులు ఉన్నారు. బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుంటుండటంతో వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన వారిలో ఆందోళన నెలకొంది.

కాగా బైక్‌లు తక్కువ ధరకు విక్రయించడంతో స్థానికులు కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. చోరీ వ్యవహారంపై వివరాలు వెల్లడించేందుకు స్థానిక పోలీసులు నిరాకరిస్తున్నారు. సీఐ కరుణాకర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి బాలుడి మృతి

పాల్వంచ: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి బుధవారం ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని నవభారత్ శేఖరం బంజర గ్రామానికి చెందిన కర్నావత్ ఆశ కుమారుడు జశ్విక్ (4) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో నవభారత్ సెంటర్‌లోని ఆర్‌ఎంపీ సతీష్ వద్ద చికిత్స చేయించారు. తుంటికి ఇంజక్షన్ చేయడంతో విపరీతంగా నొప్పి వస్తుందని బాలుడు రోదించడంతో మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఆర్‌ఎంపీ సూచించాడు. తుంటి భాగం మొత్తం నల్లబడి, బొబ్బలు వచ్చాయి. వైద్యం వికటించినట్లు గుర్తించి తక్షణమే ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ రిఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో బాలుడు మృతి చెందాడు. అధిక మోతాదులో ఇంజక్షన్ వేయడం వల్లే బాలుడు చనిపోయాడని ఆర్‌ఎంపీ ఇంటి వద్ద కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు వచ్చి ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు రోదిస్తున్న తీరు కలిచివేసింది. కాగా ఆర్‌ఎంపీ పరారీలో ఉన్నాడు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ కె.సుమన్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


చిన్న పోలయ్య(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన పసుపులేటి చిన్న పోలయ్య(56) తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే తన ఇంటి వద్ద సెంట్రింగ్ పని చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా, కుటుంబీకులు సత్తుపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య గోవిందమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

10 కేజీల గంజాయి సీజ్

పాల్వంచరూరల్: పది కేజీల గంజాయిని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని సోములగూడెంక్రాస్ రోడ్డు వద్ద పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని విచారించారు. దీంతో వారివద్ద రూ.2.50 లక్షల విలువైన 10 కేజీల గంజాయి లభించింది. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి ప్రాంతంలోని చౌలమండికి చెందిన జగన్నాథ్ బైపరి, లాలుతంతి గంజాయి తరలిస్తుండగా అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు.

Office of the Executive Engineer,
TGMSIDC Division, Khammam.
Govt. Hospital Back Side, Opp. Sahakara Nagar Board, Khammam - 507 002.
E-mail Id: eetsmsidckmm1@gmail.com
(An ISO 9001 : 2015 Certified Organization)
Tender Notice No.: 06/EE/TGMSIDC/KMM/2024, Date: 04-09-2024.
Tenders are invited through e-procurement platform. The details of works can be seen at Website: www.eprocurement.gov.in
EXECUTIVE ENGINEER





సాక్షి క్లాసిఫైడ్స్

Education
■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్ : డిగ్రీ, PG, B.Tech.,Diploma,D&B-ఫార్మసీ,B.Ed,B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM.4నెలల్లో పరీక్షలు.ఫోన్:8886977112,339 [HA-16389]

Services
■ ఫింగో ఎంటర్‌ప్రైజెస్ అన్ని రకాల వ్యాపార ప్రాజెక్ట్‌లను అందిస్తుంది వ్యక్తిగత, వ్యవసాయ, విద్య DMA స్వాగతం, జీతం+కమీషన్, ✆ 9266809540. [T-279]

BUSINESS OFFER
■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్:పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-2157]

Wanted
■ Wanted Male and Female work for MNC Company Qul: 10th to Degree, Sal: 15k to 25k cont: 9030612463 (work from home facility is available) [G-9023]

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ:18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796272]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792